ప్రశాంతంగా ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని ఎస్‌జిటి ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సిలింగ్‌ను పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండోరోజు నిర్వహించారు. 43 పోస్టులు బదిలీల కౌన్సిలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. వీటిలో ఎస్‌జిటి 37, ఎల్ తెలుగు 3, ఎల్‌పి హిందీ 3 మొత్తం 43 మందికి బదిలీలు కౌన్సిలింగ్ విజయవంతంగా జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, హెచ్‌ఎంలు నారాయుడు, సూర్యనారాయణ, సూపరింటెండెంట్ దేశ్, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

రోగాలు తరుముకొస్తుంటే యోగాలో వైద్య శాఖ

ప్రజాశక్తి - పార్వతీపురం

నైరుతి రుతుపవనాలు ముందస్తు రాకతో జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు పడ్డాయంటే వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ కేసులు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో జ్వరాలు విజృంభిస్తాయి. ఇప్పటికే జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జూన్ నుంచి నైరుతి రుతుపవనాల కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం వుందని, వైరల్ జ్వరాలు విజృంభిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలుసు. వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ కేసుల నియంత్రణపై దృష్టి సారించాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గత కొద్దిరోజులుగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో బిజీబిజీగా గడుపుతున్నారు. యోగాసనాలు వేస్తే రోగాలన్నీ మాయమవుతాయనే సంకేతాలు పంపుతున్నారు. జూన్ 21న యోగా దినోత్సవం

జ్వరాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

మన్యం జిల్లా అధికారుల తీరుపై విమర్శలు
నైరుతి వర్షాలతో వైరల్ జ్వరాల విజృంభణ

సందర్భంగా నెలరోజుల ముందు నుంచే యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడమే తరువాయి అన్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సహా అధికారులంతా ఈ కార్యక్రమంలో తలమునకలతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత

ఏజెన్సీ ప్రాంతంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత ఎక్కువగా ఉంది. మలేరియా నివారణకు అవసరమైన మందులు చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లేవు. ఇప్పటికే సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం తదితర మండలాల్లో వైరల్ జ్వరాలు, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జ్వరాలు క్రమేణా పెరుగుతున్నాయి. పిహెచ్‌సిల్లో మలేరియా నివారణకు వినియోగించాలల్సిన ఆర్టినేట్, లారిగో ఇంజెక్షన్లు అందుబాటులో లేవు. ఈ మందులు లేకపోవడంతో వైద్యులు ప్రయివేటు మందుల షాపుల్లో కొనుక్కోవాలని సూచిస్తున్నారు. పిహెచ్‌సిలకు ప్రతి ఏటా అరకొర మందులే సరఫరా అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంకా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు తెరుచుకోలేదు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాల్సిన అధికారులు యోగాంధ్రాలో బిజీగా ఉన్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మలేరియా, డెంగీ కేసుల నివారణకు చర్యలు చేపట్టాలి : పిఒ

స్థానిక ఐటిడిఎ పరిధిలో మలేరియా, డెంగీ కేసులు లేకుండా నివారణకు చర్యలు చేపట్టాలని పిఒ అశుతోష్ శ్రీవాస్తవ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబరులో వైద్యులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని మలేరియా, మరియు డెంగీ కేసులు ఉండరాదని, వాటి నివారణకు పూర్తి చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఐఎంఆర్, ఎంఎంఆర్ మరణాల రేటును తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంలో వైద్యాధికారులంతా ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.వి.ఎస్. పద్మావతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఎం.వినోద్ కుమార్, ఎనిమిది మండలాలకు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత

మాదక ద్రవ్యాలు అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిఘా పెంచాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిఘా పెంచడమే కాకుండా వాహనాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. మున్సిపాలిటీలు కనీసం 500 సీసీ కెమెరాలు సమకూర్చాలన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి వివరాలతో అవగాహన పోస్టర్లను పెట్టాలన్నారు. అటవీశాఖ అధికారులు ఆధునిక పరిజ్ఞానంతో మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మాదక ద్రవ్యాల ఉత్పాదన, రవాణా, వినియోగం, ప్రోత్సహించడంలో ఎవరు భాగస్వామ్యమైనా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం అధిక మొత్తంలో జరుగుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించామన్నారు. వీటిలో అత్యంత అధిక వినియోగం చేస్తున్న ప్రదేశాలు కూడా ఉన్నాయని, ఇటువంటి ప్రదేశాల వద్ద నిఘా పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. క్యూఆర్ కోడ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి మాదకద్రవ్యాల సమాచారంపై ప్రజల స్పందన కూడా తెలుసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ మేరకు 21 పోలీస్ స్టేషన్లో పరిధిలో 7841 మంది ప్రజలు పాల్గొని స్పందన అందించారన్నారు. డ్రోన్ సర్వేలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు స్వయం రక్షణ పద్ధతులు నేర్పించడం, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్బులను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. జనవరి నుంచి మే వరకు మాదక ద్రవ్యాలకు సంబంధించి 11 కేసులను నమోదు చేశామని, ఇందులో 1875 కేజీల గంజాయి రవాణా చేయడం జరిగిందన్నారు. రవాణా శాఖ అధికారి ఎం శశికుమార్ మాట్లాడుతూ రవాణా శాఖ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుందని, 199 కేసులను బుక్ చేయడం జరిగిందని చెప్పారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ జిల్లాలో నవోదయం రెండో దశ పగడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. 27 గ్రామాలను నాటు సారారహిత గ్రామాలుగా ప్రకటించామని చెప్పారు. ఆంధ్రా - ఒడిశా అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 50,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారన్నారు. నాటు సారా తయారీకి సహకరిస్తున్న 64 మంది బెల్లం వ్యాపారులను గుర్తించామని చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, ఎఎస్‌పి అంకిత సురాన, పాలకొండ డిఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వినోద్, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

యోగా ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంతంగా జీవించగలరని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. యోగాంధ్రా మాస వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి, ఒత్తిడిని తగ్గించడానికి, అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి సహాయపడుతుందన్నారు. యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, ఐఎంఎ అధ్యక్షులు యాళ్ల వివేక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.నాగభూషణం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న వైద్యాధికారులు

సమస్యలు పరిష్కరించాలంటే కేసులు పెడతారా?

ప్రజా సంఘాల నాయకులపై వేధింపులు ఆపాలి: సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని భూసమస్యలను పరిష్కరించమంటే ప్రజాసంఘాల నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని వివిధ మండలాల్లో భూ సమస్యలపై సిపిఎం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆందోళనలు చేపట్టామని తెలిపారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఆ దిశగా ప్రయత్నించకపోగా ప్రజా పోరాటాలను నిర్వహిస్తున్న సిపిఎం, ఇతర ప్రజా సంఘాల నాయకులపై బైండవర్ (107) కేసులు పెట్టి వేధింపులకు గురి చేయడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పార్వతీపురం, పాచిపెంట మండలాల రెవెన్యూ అధికారులు అక్కడ భూ సమస్యలు పరిష్కరించడం చేతకాక ఇలా నిర్బంధాన్ని ప్రయోగించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఉందని, జిల్లా వ్యాప్తంగా భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని, లేనిచో ఈ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పార్వతీపురం, పాచిపెంట తహశీల్దార్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పార్వతీపురం మండలంలోని బంటువానివలస నిర్వాసితుల భూ సమస్యపై ఆందోళన నిర్వహించిన 10 మంది నాయకులపై, పాచిపెంట మండలం కుడుమూరు భూ సమస్యపై ఆందోళన నిర్వహించిన సిపిఎం నాయకులపై బైండోవర్ కేసులు బనాయించారని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గంగునాయుడు తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేయడం సర్వసాధారణమైన ప్రక్రియను, అలాంటి సాంప్రదాయాన్ని గాలికి వదిలి ప్రజా ఉద్యమాలు చేస్తున్న వారిపై క్రిమినల్స్, సంఘ విద్రోహ శక్తులపై పెట్టాల్సిన కేసులను బనాయించి నిర్బంధం ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తమ ధోరణి మార్చుకొని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేనిచో భూ సమస్యల పరిష్కారానికి, ఈ నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

43 ఎస్‌సి, ఎస్‌టి కేసులకు రూ.48.42 లక్షలు నష్టపరిహారం

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల కింద 43 కేసులకు రూ.48.42 లక్షలు నష్టపరిహారంగా చెల్లించినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 40 కేసులకు రూ.54.50 లక్షలు చెల్లింపు పెండింగ్లో ఉందని, ఆరు కేసులు విచారణ కొనసాగుతుందని వివరించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అన్ని వసతి గృహాలు, పాఠశాలలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మొట్ట మొదటి రోజు నుంచే విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి తగిన పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థల్లో చేరే విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రం జారీకి అన్ని ఏర్పాట్లు జరిగాయని ఆయన చెప్పారు. కుటుంబంలో ఎవరైనా సభ్యులు గతంలో కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉంటే అటువంటి విద్యార్థులకు తక్షణ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేస్తామన్నారు. కుటుంబంలో కుల ధ్రువీకరణ పత్రం ఎవరికీ లేకుండా మొదటిసారి కుల ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకుంటే అటువంటి వారికి 21 రోజుల్లో విచారణ పూర్తి చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని తెలిపారు. డీఎస్సీ, నీట్, జెఇఇ వంటి పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తగిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సంబంధిత వ్యవహారాల్లో ఏర్పడిన వివాదాల కారణంగా ఎస్సీ, ఎస్టీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. ఇందుకు ప్రధాన కారణంగా ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం వల్ల సమస్యకు ముగింపు పలుకుటకు అవకాశం ఉంటుందన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయ చంద్ర మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో జిల్లా స్థాయి అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. కులాన్ని అడ్డంగా పెట్టుకుని కేసులకు వాడుకోవడం సరికాదన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలపై వివిధ రకాల భూములను ఇతరులు ఆక్రమించుకుంటున్నారని వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులంతా కృషి చేసి ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, ఎఎస్‌పి అంకిత సురాన, పాలకొండ డిఎస్పీ ఎం రాంబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జలవనురుల కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.అప్పలనాయుడు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం వినోద్, కమిటీ సభ్యులు, నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేణు గోపాల్, కౌలు చిరంజీవులు, సామల సింహాచలం, కె.బలరాం, ఎ.గోవిందమ్మ, బచ్చల దయానంద, జలుమూరు మణికంత, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈనెల జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. పట్టణంలోని ఇందిరా కాలనీలో కలెక్టర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీలో ప్రజల స్పందన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సదుద్దేశంతో పింఛన్లను పంపిణీ చేస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో రూ.59.32 కోట్లు పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ సచివాలయ కార్యదర్శులు, స్థానిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీ పురం : గుమ్మలక్ష్మీపురంలోని కొండవీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా ఒకటన లబ్ధిదారుల ఇంటి వద్దకే నేరుగా వెళ్లి పెన్షన్ ఇస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, ఎంపిడిఒ సాల్మన్‌రాజ్, కూటమి నాయకులు చిన్న, రాజేష్, మన్మథ, దివాకర్, దొర, సచివాలయ సిబ్బంది, కూటమి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మండలంలోని నర్సిపురంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో 8576 మంది వితంతు, వృద్ధాప్య, వంటరి మహిళా, చేనేత, మత్స్యకార, వికలాంగులు తదితరులకు పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ తెలిపారు. 9593 మందికి గాను 8576 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

యోగా పేరిట సర్కారు మైండ్‌గేమ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే, దూడకు గడ్డి కోసమే! అన్నాడట వెనుకటికి ఓ వ్యక్తి. వాస్తవానికి తాటిచెట్టుపై గడ్డి ఉండదు కదా? ఉంటే గింటే తాటి కాయలు, కమ్మలు ఉంటాయి. ఆ విషయాన్ని తెలియనీయకుండా దూడకు అవసరమైన గడ్డి కోసమే అని తెలివితేటలు ప్రదర్శించాడట. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరిట అచ్చంగా అటువంటి మైండ్ గేమ్ ఆడుతున్నాయి. యోగా, సంగిడి, కుస్తీ పోటీలు పూర్వం నుంచీ ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఒకప్పుడు ఉండేవి. వీటిని బల ప్రదర్శన శాలలని పిలిచేవారు. విజయనగరంలోని కలియుగ భీముడుగా పేరు గాంచిన కోడి రామ్మూర్తి బల ప్రదర్శనశాల చరిత్ర దేశంలోనే పేరుగాంచింది. ఈ లెక్కన యోగా అనేది శారీరక వ్యాయామంలో ఒక భాగం అనేది వేరుగా చెప్పనక్కర్లేదు. శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందినట్టే శారీరక వ్యాయామంలోనూ అనేక మార్పులు వచ్చాయి. ఇందులో భాగంగానే వాకింగ్ ట్రాక్‌లు మొదలుకుని, జిమ్‌ల వరకు ప్రయివేటు రంగంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఒక్క విజయనగరంలోనే నెలవారీగా రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిమ్‌లు, పార్కులు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం మదుపూ మరమ్మతుల్లేని యోగాను తెరపైకి తెచ్చింది. అంతటితో ఆగలేదు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ యోగా సర్వరోగ నివారిణి అన్నట్టుగా జనాన్ని నమ్మబలుకుతోంది. ఇందులో భాగంగానే ఏటా యోగా కార్యక్రమాలకు పిలుపునిచ్చిన కేంద్రం... ఈ ఏడాది మే 21 నుంచి జూన్ 21వరకు నెల రోజులపాటు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. అంతే తడువుగా రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎద్దు ఈనిందంటే దూడను కళ్లంలో కట్టేయమన్నట్టుగా కేంద్రం ఇలా పిలుపునిచ్చిందో లేదో వెంటనే యోగాంధ్ర.. అంటూ ప్రకటించింది. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఈ నెల 21న ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీనే విశాఖపట్నం వస్తారట. ఆ రోజు రెండు లక్షల మందితో యోగాసనాలు వేయించాలని లక్ష్యం కూడా పెట్టేసుకున్నారు. ముందూ మునుపు ఇటువంటి కార్యక్రమాలు చేశారా? అంటే ఇటువంటివేమీ లేదనే చరిత్ర చెబుతోంది. వ్యాయామంపై ప్రభుత్వానికి అంత

చిత్తశుద్ధి ఉంటే, పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించేది. ఆ పనిచేయకుండా క్రమబద్ధీకరణ పేరుతో ఆ పోస్టులనే లేపేసింది. అయినా, యోగాను ఎందుకు ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారంటే ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తహతహలాడుతోంది. కార్యక్రమం అంతలా నిర్వహించాలంటే మరి జనం రావాలి కదా?. ఇందుకు కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వారి కార్యకర్తలు ఎలాగూ ముందుకు వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే వారికి తెలుసు యోగా అనేది సర్వరోగ నివారిణి కాదని. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ సూచనలు, సలహాలు ఉన్నాయని. ఇదంతా యోగా ముసుగులో బిజెపి చేస్తున్న మత ప్రచారమని. కాబట్టి ప్రధాని నుంచి ప్రశంసలు పొందాలంటే సామాన్య ప్రజానీకాన్ని నమ్మబలకాలి. శిక్షణలు ఇవ్వాలి. ఇలా అయితేనే ప్రధాని విశాఖపట్నం వచ్చినరోజు పెద్ద ఎత్తున జనం కదిలేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం మన జిల్లా అధికార యంత్రాంగం పడరాని పాట్లు పడుతోంది. ఒకటీ రెండూ కాదు సుమా..! కొన్ని శాఖల అధికారుల సమన్వయంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డిఆర్‌డిఎ పీడీని సమన్వయకర్తగా నియమించారట. ఇప్పటికే యోగాంధ్ర, యోగా స్ట్రీట్ పేరిట గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా యోగా శిక్షణలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. చివరికి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. బహుశా అధికార పార్టీల నాయకులు, కార్యకర్తలు యోగాసనాలకు ముందుకు రావడం లేదో? ఏమో మరి. యోగాసనాలకు మించి రెక్కలు ముక్కలు చేసుకుని ఉపాధి కూలీలు, వ్యవసాయ పనులు చేసుకుంటున్న 5వేల మందితో యోగాసనాలు నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా ఉపాధి పనుల పర్యవేక్షణ కన్నా ఈ కార్యక్రమం నిర్వహణే ప్రాధాన్యత అంశంగా మారిపోయింది.

ఇది అసలు అజెండా

యోగా ప్రదర్శనల కోసం అధికారుల తిప్పలు ఈ విధంగా ఉంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అజెండా వేరుగా ఉంది. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ముఖ్యంగా విద్య, వైద్య రంగాల ప్రయివేటీకరణపై ప్రశ్నించే గొంతులు మూగబోవాలంటే ఆర్‌ఎస్‌ఎస్ బోధిస్తున్న ఖర్మ సిద్ధాంతం జనానికి ఎక్కించాలి. ఓంకార నాదంతో మొదలుపెట్టే యోగా ముసుగులో మత ప్రచారం చేయడం చాలా సులువుగా ఉంటుంది. సరిగ్గా బిజెపి, దాని మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు కావాల్సింది కూడా ఇదే. ప్రజలంతా యోగాసనాల్లో ఉంటే, వైద్యరంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టడం కూడా సులువే. స్వామికార్యంతోపాటు స్వకార్యం అన్నట్టుగా ఇప్పటికిప్పుడు వైద్యరంగం ప్రయివేటీకరణపై వ్యతిరేకతనూ తగ్గించుకోవచ్చు. భవిష్యత్తులో ఖర్మ సిద్ధాంతంలోకి నెట్టి, ప్రశ్నించే తత్వాన్నే లేకుండా చేయొచ్చన్నది వారి భావన. ఇటువంటి కుయక్తులు ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ ముందుకుసాగే పరిస్థితి లేదని పబ్లిక్ టాక్.

ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార నది

వంశధారలో పెరిగిన వరద నీరు

ప్రజాశక్తి - భామిని

ఒడిస్సాలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో భామిని మండలం గుండా ప్రవహిస్తున్న వంశధార నదిలో వరద నీరు పెరిగింది. సాధారణంగా భామిని మండలంలోని పలువురు వంశధార నదిని కాలినడకన దాటి సమీపాఉన్న కండవ, లిహూరి రైల్వే స్టేషన్ వద్ద రైలు ఎక్కి ఇటు వైజాగ్, పలాస, టెక్కలి, ఒడిస్సాలోని పూరీ వెళ్తుంటారు. ప్రస్తుతం వరద నీరు ఉధృతి పెరగడంతో ఒకరినొకరు చేతులు పట్టుకుని నది దాటాల్సిన పరిస్థితి. ఇదే సందర్భంలో వేసవి సెలవుల నేపథ్యంలో వంశధార నది పరీవాహక గ్రామాల్లో చిన్న పిల్లలు, విద్యార్థులు నదీ తీరప్రాంతాలకు వెళ్లేటప్పుడు, నదిలో స్నానానికి వెళ్లేటప్పుడు తల్లి దండ్రులు జాగ్రత్త వహించాలని రెవెన్యూ అధికారులు సూచనలు చేస్తున్నారు.

బోరు తవ్వకాలను అడ్డుకున్న శెంబి గిరిజనులు

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువ శెంబిలో బోరు తవ్వకాలకు సంబంధించి రిగ్ యంత్రాలను ఒడిశా ప్రభుత్వం పంపించగా స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. గ్రామంలో ఎపి ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించేందుకు నిర్దేశించిన స్థలంలో ఒడిశా ప్రభుత్వం బోర్ తవ్వకానికి యంత్రాలను శనివారం పంపించింది. దీన్ని ప్రతిఘటించిన ఎగువశెంబి గ్రామస్తులు బోర్ తవ్వకానికి అడ్డుకుంటూ యంత్రాలను తిప్పి పంపించారు. ఒడిశా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తిరస్కరిస్తామని కొన్ని కొటియా గ్రామాలు చెప్పడంతో ఒడిశా ప్రభుత్వం దూకుడు పెంచుతోంది.

తాడికొండ పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పిహెచ్‌సిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కావాల్సిన మందులను ముందుగానే ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. వస్తున్నది వర్షాకాలం కావున జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని, అలాగే రోగులకు రిఫరెన్సులు తగ్గించి ఇదే హాస్పిటల్‌లో వీలైనంత వరకు చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, లుంబేసు మాజీ సర్పంచ్ తోయక జమ్మయ్య ఉన్నారు.

సత్యనారాయణ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామీణ నీటి సరఫరా విభాగం గ్రేడ్ వన్ మెకానిక్ సత్యనారాయణ సేవలు అభినందనీయమని జిల్లా గ్రామీణ నీటిసరఫరా అధికారి ఒ.ప్రభాకర్ రావు అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ విధినిర్వహణలోనూ, అధికారులతోనూ సామరస్యంగా తన విధిని నిర్వర్తించుకునేవారన్నారు. అలాగే ప్రజలతోనూ ప్రజాపతినిధులతోనూ స్నేహభావంగా ఉండేవారిని ఆయన కొనియాడారు. తన జీవితం మంచిగా ఉండాలని అలాగే తన సూచనలు, సలహాలు అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇ కె.నాగేశ్వరరావు, కురుపాం, పార్వతీపురం డిఇ హనుమంతరావు, ఎంపిడిఒ ఎంఎంఎల్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, ఏనుగులపేట సర్పంచ్ శ్రీహరినాయుడు- పద్మావతి కుటుంబ సభ్యులు, ఎంపిపి బి.రమణమ్మ -శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, మండల పరిషత్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సబ్ జైలులో రికార్డులను పరిశీలిస్తున్న లీగల్‌సెల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ హరిప్రియ

రిమాండ్ ఖైదీలకు అన్ని సౌకర్యాలూ కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ

రిమాండ్‌లో సబ్ జైల్లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న అన్ని సౌకర్యాలు పూర్తిగా అందించాలని మండల లీగల్ సెల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ సిహెచ్ హరిప్రియ అన్నారు. శనివారం స్థానిక సబ్ జైలును సందర్శించి జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. మీకు జైల్లో అన్ని వసతులు అందుతున్నాయా అని అడిగారు. రుచికరమైన ఆహారం ఇస్తున్నారా అని తెలుసుకున్నారు. మీకు బెయిల్ కోసం లాయర్లను ఏర్పాటు చేయాలా అని రిమాండ్ ఖైదీలను అడిగారు. మీ ఆరోగ్యంపై జైలు అధికారులు వారం, వారం ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు చేయుస్తున్నారా అని రిమాండ్ ఖైదీలను అడిగారు. జైలు సూపరింటెండెంట్ బి.జోగులుతో మాట్లాడుతూ రిమాండ్‌లో ఉన్న వీరికి ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం జైల్లో ఉన్న కిచెన్ స్టోర్ రూమ్, జైలు గదులు పరిశీలించారు. ఈ పరిశీలనలో న్యాయవాదులు కె.రవి, శామ్యూల్, హెడ్ వార్డ్ పి.చంద్రరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతే కరోనా నివారణకు ఆయుధం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

దేశంలో నేడు కరోనా కేసు పెరుగుతున్నాయని, వీటి నివారణకు ముందుస్తు అప్రమత్తతేనని స్థానిక హోమియో పతి డాక్టర్ కర్రి కాసులువర్మ శనివారం తెలిపారు. అయితే ప్రజలు కొత్త వేరియంట్లు, లక్షణాలపై అవగాహన చేసుకోవాలని ఎన్. బి.1.8.1, ఎల్. ఎఫ్ .7, ఎక్స్ ఎఫ్ జి వంటి కొత్త వేరియంట్ల ప్రభావంతో కేసులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ వేరియంట్లలో ముఖ్యంగా గొంతు శబ్దం మారడం, పొడి దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. కరోనా వృద్ధులు, పిల్లలపై అధిక ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుతం కేసుల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, జాగ్రత్తలు పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చునని తెలిపారు. ప్రజలు గుంపులుగా ఉన్న ప్రాంతాల్లో మాస్క్ ధరించడం తప్పనిసరిగా చేసుకోవాలని, స్వచ్ఛత పాటించాలని, చేతులు తరచుగా కడగడం, శుభ్రత పాటించడం చాలా ముఖ్యమని అన్నారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవడం మంచిదని అన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని కుసిమి గ్రామపంచాయతీ రాయమానుగూడ గ్రామానికి చెందిన సవర దశమయ్యకు ఎంపిడిఒ బిబి మిశ్రో డయాలసిస్‌కు చెందిన రూ.పదివేల పింఛను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఒకవైపు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మరోవైపు యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కొండగొర్రి భాస్కరరావు చేసిన ఉద్యమాలు,


భాస్కరరావును సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సేవలు అభి నందనీయమని యుటిఎఫ్ నాయకులు బిడ్డిక కూర్మారావు, పత్తిక ప్రసాదరావు, పత్తిక శంకరరావు అన్నారు. మండలంలోని పెద్దగూడ జిపిఎస్ పాఠశాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన భాస్కరరావును యుటిఎఫ్ నాయకులు సన్మానించారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ మచ్చలేని మనిషిగా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్ ఉన్నారు.

చిన్నపాటి వర్షానికే ఛిద్రమైన రహదారి

- కుంగిపోయిన ఈరులగెడ్డ వంతెన
- రూ.2 కోట్లు బూడిదలో పోసిన పన్నీరే
- నిద్రావస్థలో పిఆర్ ప్రాజెక్టు అధికారులు

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో పంచాయతీ రాజ్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి మచ్చుతునక ఈ రహదారి నిర్మాణం. మారుమూల గ్రామాల్లో రహదారుల నిర్మాణంలో పిఆర్ ప్రాజెక్ట్ అధికారులు ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో ఈ రహదారి నిర్మించిన తీరు చూస్తే స్పష్టమవుతోంది. కమిషన్ల మత్తులో ఊగిపోతున్న అధికారులు నాణ్యత లేని రహదారుల నిర్మాణంపై చోద్యం చూస్తున్నారనడానికి ఇదే నిదర్శనం.

మండలంలోని కె.ములగ జంక్షన్ నుంచి డోకిశిల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి 2024 మార్చి 16న శంకుస్థాపన చేశారు. అంటే గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఈ రోడ్డు నిర్మాణం టిడిపి ప్రభుత్వం హయాంలో పూర్తయింది. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఈ రోడ్డుని ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది నెలలకే ఈ రోడ్డు చిద్రమయింది. ఎక్కడకక్కడ బీటలు వారింది. రూ.2.05కోట్లతో ఈ రోడ్డు నిర్మించిన తీరు స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నిర్మాణం చేసి ఏడాది కాకముందే బీటలు వారడంతో వాహనదారులు బెంబేలెత్తి పోతున్నారు. తేలునాయుడువలస సమీపంలో ఉన్న ఈరులగెడ్డ వంతెన కుంగిపోయింది. శుక్ర, శనివారాల్లో కురిసిన చిన్నపాటి వర్షానికే ఈ రోడ్డు ఇంతలా చిద్రమయితే రానున్న రోజుల్లో భారీ వర్షాలకు రోడ్డు మొత్తం కొట్టుకుపోయేలా వుందనీ జనం గుసగుసలాడుకుంటున్నారు. ఈ రోడ్డు మార్గం గుండా వున్న పాతకల్వర్టులు, వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించకుండా ఉమ్మితడి పనులతో నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఈ రోడ్డుని సకాలంలో బిల్లులు మంజూరు కావడం లేదనే నెపంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు పిఆర్ ప్రాజెక్ట్ అధికారుల పర్యవేక్షణలో జరగలేదని తెలుస్తోంది.


శిథిలమైన కె.ములగ - డోకిశిల రోడ్డు

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నాణ్యత లేని రహదారుల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్, పంచాయతీ రాజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి. చిన్నపాటి వర్షానికే ఈ రోడ్డు చిద్రమయింది. ఈరులగెడ్డ వంతెన కుంగిపోయింది. రోడ్డులో ఎక్కడికక్కడ బీటలు వారాయి. నిర్మించిన ఆరునెలలకే రోడ్డు ఇలా తయారైతే మున్ముందు భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది.

పి. రాము, సిపిఎం నాయకులు పార్వతీపురం.

సరస్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పెద్ద పెద్ద నగరాలు, పట్టణాల్లో మాత్రమే ప్రదర్శించే సరస్ 2025 మేళాను పార్వతీపురంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ అవకాశాన్ని పార్వతీపురం ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర సూచించారు. జూన్ 1,2,3 తేదీల్లో పార్వతీపురంలో జరిగే ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ తల్లి పండగల సందర్భంగా డిఆర్‌డిఎ, నాబార్డు సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన మెగా డ్వాక్రా బజారును ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సుమారు 60 స్టాళ్లలో డ్వాక్రా సభ్యులు రూపొందించిన కళాకృతులు, ఆహార ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. డ్వాక్రా సభ్యులతో మాట్లాడి దుస్తులు, ఆహార ఉత్పత్తుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ అమ్మవార్ల పండుగ సందర్భంగా ఇక్కడ సరస మేళాను ఏర్పాటు చేయడం, ఈ మేళాకు రాష్ట్రంలోని సుమారు ప్రాంతాల నుంచి డ్వాక్రా సభ్యులు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చి డ్వాక్రా సభ్యులను ప్రోత్సహించాల్సి ఉందని, ఇలాంటి మేళాను పార్వతీపురం ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు, క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పామని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంకు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెంది న విద్యార్థులతో పాటు, జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.

4న వెన్నుపోటు దినం : అలజంగి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. హామీలను విస్మరించిన ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 4న పార్వతీపురంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను నాయకులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన అందిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో భయోత్పాత వాతావరణాన్ని సష్టిస్తున్నారని ఆరోపించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మువ్వల సత్యంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పలువురు జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ : జూన్ 4న పాలకొండలో వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి అన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్సీ స్వగృహం దగ్గర ఆవిష్కరించారు. ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు కనపాక సూర్య ప్రకాష్, వెలమల మన్మధరావు, వీరఘట్టం ఎంపిపి ధమలపాటి వెంకటరమణ, బంకి లక్ష్మీమూర్తి, రణస్థలం రాంబాబు, పల్లా భాను, లిల్లీ పుష్ప నాదం, ఉపేంద్ర, కడగల రమణ, నెల్లి శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎస్ఇ చలపతిరావును సన్మానిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి, ఎమ్మెల్యే విజయచంద్ర

చలపతిరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ట్రాన్స్కో, పర్యవేక్షక ఇంజనీర్‌గా పనిచేసిన కోడా చలపతిరావు సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం ఉద్యోగ వివరణ చేస్తున్న చలపతిరావును కలెక్టర్, ఎస్‌పి ఎస్ వి మాధవ రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చలపతిరావు అంకితభావంతో విధుల నిర్వహించారన్నారు. శంబర, సాలూరు జాతరల సమయాల్లో విద్యుత్తు నిర్వహణలో ప్రశంసనీయమైన పాత్రను పోషించారని ఆయన అన్నారు. చలపతిరావు వంటి విధి నిర్వహణ పట్ల అంకితభావం వ్యక్తుల స్ఫూర్తితో మిగిలిన సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అనేక పవర్ ప్రాజెక్టులను యోచిస్తుందని వాటిలో భాగస్వామ్యం కావాలని, మంచి సలహాలు సూచనలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, ఎఎస్‌పి అంకిత సురానా, పాలకొండ డిఎస్పీ ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీకి సంబంధించిన లుంబురు వద్ద గల జగనన్న కాలనీకి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలో సరైన రహదారులు, వీధి దీపాల్లేవని, దీనివల్ల అక్కడ నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ సమస్యపై గతంలో సిఐటియు ఆధ్వర్యంలో పట్టణ పౌరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో అక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు అసౌకర్యానికి గురవుతారన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీ దగ్గరలోనే తాత్కాలిక డంపింగ్ యార్డ్ ఉండడం వల్ల దుర్వాసనతో అక్కడున్న వారు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వెంటనే నగర పంచాయతీకి శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలన్నారు. అధికారంలో ఉన్న పాలకులతో పాటు నగర పంచాయతీ కౌన్సిలర్లు, అధికారి యంత్రాంగం దీనిపై శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ సమస్యలపై అవసరమైతే ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.

ఐదో తేదీలోపు బియ్యం పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి నెలా ఐదో తేదీలోపు కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని తహాశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ డీలర్లను ఆదేశించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్డుదారులకు అందుబాటులో ఉండి నిత్యవసర వస్తువులు అందేలా చూడాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని 56 డిపోలు పరిధిలో 19,816 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. 2,774 మంది దివ్యాంగులు, మంచంపట్టిన వారు ఉన్నారని, వీరి వద్దకు వెళ్లి రేషన్ స్వయంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంకాలం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరిచి ఉంచాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో డీలర్లు పాల్గొన్నారు.

భామిని : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్.శివన్నారాయణ ఆధ్వర్యంలో రేషన్ డిపో సేల్స్ మెన్లు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి 15 వరకు డిపోల్లో ఉదయం 8 గంటల నుంచి

డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 8 వరకు అందుబాటులో ఉండి రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ అందజేయాలని తెలిపారు. అలాగే డిపోలకు రాలేని వృద్ధులకు, వికలాంగులకు, దీర్ఘ కాలిక వ్యాధులతో మంచాన పడి ఉన్న వారి ఇళ్లకు రేషన్ అందజేయాలని తెలిపారు. ప్రతిరోజు సక్రమంగా స్టాక్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని, ఇన్ స్టాక్, అవుట్ స్టాక్ వివరాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి ప్రభాకర్, విఆర్ఒలు, డీలర్లు, సేల్స్‌మెన్లు పాల్గొన్నారు.

సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది

సత్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట, పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో 42ఏళ్ల సుదీర్ఘకాలంలో గిరిజనులకు సేవలందించిన సీతంపేట ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ బివిఎస్ సత్యనారాయణ సేవలు మరువలేనివని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సత్యనారాయణ ఎక్కువ సమయం పనిచేస్తూ మిగిలిన సిబ్బందికి ఆదర్శంగా ఉండేవారన్నారు. యువ కాంట్రాక్టులకు ప్రోత్సహించే వారిని చెప్పుకొచ్చారు. అనంతరం సత్యనారాయణ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రమాదేవి, డిఇలు సింహాచలం, సిమ్మన్న, కృష్ణకుమార్, గన్నిరాజు, జెఇలు రమేష్, నాగభూషణం, కిరణ్‌మోహన్, గోపాల్, ఎపిఒ సాగర్, జెటిఒ మెట్ట రామారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా క్రీడా సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. మే 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు నెలరోజులపాటు జరిగిన ఈ శిక్షణలో చదరంగం, సాఫ్ట్‌బాల్, వాలీబాల్ ఆటలపై విద్యార్థులకు శిక్షణ నిర్వహించినట్లు శిక్షకులు సబ్బాన మురళి, పింకి సంతోష్, పవన్ తెలియజేశారు. శనివారం జరిగిన ముగింపు వేడుకలలో స్థానిక ఎంపిటిసి వై.తవిటినాయుడు, మాజీ ఎంపిపి గొట్టాపు గౌరీ వెంకటరమణలతోపాటు, శిక్షణ కాలంలో విద్యార్థులకు స్నాక్స్ అందించిన దాతలు విక్రాంత్, ప్రసాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నిమ్మక

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా కురుపాంకు చెందిన జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్‌ను ఎంపిక చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి గూడెంలో శనివారం విడుదల చేసిన జాబితాలో ఆయనకు చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రెటరీగా పదవి ఇప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వారి సూచనలు, సలహాలు పాటిస్తూ వైసిపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జెడ్పీ కోప్షన్ సభ్యులుగా ఉంటూ స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా పదవి ఆయనకు లభించినందుకు ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి సుజాత, స్థానిక వైసిపి ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వైసిపి రాష్ట్ర యూత్ కార్యదర్శిగా నిమ్మక

గుమ్మలక్ష్మీపురం : వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గుమ్మలక్ష్మీపురానికి చెందిన సీనియర్ నాయకుడు నిమ్మక గోపాల్ నియమితులయ్యారు. మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి సిఫారసు మేరకు అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా నిమ్మక గోపాల్ మాట్లాడుతూ కురుపాం నియోజవర్గంలో పుష్ప శ్రీవాణి అండదండలతో వైసిపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, పరీక్షిత్ రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

ప్రజాశక్తి - పాచిపెంట

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రస్తాకుటుంబాయి కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కషి సంకల్ప అభయాన్ మండలంలోని మాతుమురు, విశ్వనాథ పురం, పనుకువలస గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యన, ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ వి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.తేజేశ్వరరావు, మధుసూదనరావు, ప్రత్యూష, ఎం.సూర్య నారాయణ, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ బృందంగా ఏర్పడి మాతుమురులో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం అందించే పథకాలు, భూసార పరీక్షలు, వాటి ఉపయోగాలు, వరి, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు, యాంత్రీకరణ, సమీకృత వ్యవసాయం పంటల మార్పిడి గురించి వివరించారు. మరో బృందం డాక్టర్ అనంత విహారి, డాక్టర్ పూర్ణబిందు విశ్వనాథపురంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం అందించే పథకాలు, ప్రకృతి వ్యవసాయం, వరిలో అధిక దిగుబడికి మేలైన యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్యం భూసార పరీక్షలు ఉపయోగాలు గురించి వివరించారు. డాక్టర్ జి.అమృతవీణ, కె.విశ్వనాథ్ రెడ్డి, ఎఒ కె.తిరుపతిరావు, వ్యవసాయ విస్తరణాధికారి శైలజ ఒక బృందంగా ఏర్పడి పనుకు వలసలో ప్రభుత్వం అందించే పథకాలు, వరిలో ఎరువుల యాజమాన్యం, చిరు ధాన్యాల్లో కొత్త రకాలు, భూసార పరీక్షలు గురించి వివరించారు. రైతులకు భూ ఆరోగ్య కార్డులు నవధాన్య విత్తనాలు పంచారు. ఈ సందర్భంగా రైతులు వివిధ పంటల్లో ఆశించే చీడపీడలు డ్రోన్ పరిజ్ఞానం గురించి ప్రశ్నలు సంధించారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కారు, ఆటో ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - చీపురుపల్లి, కంటోన్మెంట్

విజయనగరంలోని ఫారెస్ట్ కార్యాలయం అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం రాయవలస పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన పప్పల శివ (35) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. మండలంలోని రైతుల వద్ద నుండి కూరగాయలను కొనుగోలు చేసి నిత్యం విజయనగరం రైతు బజార్‌కు తరలిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం శోక సంద్రంలో మునిగింది.

కోట దుర్గ హుండీ ఆదాయం రూ.8.92 లక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని కోట దుర్గమ్మ వారి హుండీని శనివారం లెక్కించగా రూ.8లక్షల 92 వేల 433 ఆదాయం లభించింది. మార్చి 26 నుంచి శనివారం వరకు వచ్చిన ఆదాయంగా ఆలయ కార్యనిర్వాహక అధికారి సూర్యనారాయణ తెలిపారు హుండీ లెక్కింపు, పర్యవేక్షణకు జిల్లా దేవదాయ శాఖ జూనియర్ సహాయకులు వై.ఇందిరా వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ, ఏపీజీవీబీ బ్యాంక్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని డికె పట్నం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. బైక్ మీద వెళ్తున్న ఇద్దరు గిరిజనులను గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టినట్లు స్థానికులు చెబుతు న్నారు. ఘటన స్థలంలో పీడిక అప్పన్న మృతి చెందగా, మరొకరు డోకిశీల పిహెచ్‌సిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మృతుల్లో ఒకరిది సంధి వలస గ్రామం కాగా మరొకరు ఒరిస్సా వాసి అని తెలుస్తోంది. సంఘటన విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన గిరిజనులు